క్లుప్తంగా

బెతస్థా న్యూ అభ్యుదయ సేవా సంఘం సందర్శన



రేపల్లె రూరల్: పట్టణంలోని బెతస్థా న్యూ అభ్యుదయ సేవా సంఘంను మంగళవారం ఐసీడీఎస్ డిస్ట్రిక్ ప్రాజెక్ట్ ఆఫీసర్ పి.సౌందర్య సందర్శించారు. సంస్థ రిజిస్ట్రేషన్ రెన్యువల్‌లో భాగంగా విచ్చేసినట్లు ఆమె పేర్కొన్నారు. ఈ సందర్భంగా రిజిస్టర్లు, స్టాకు, హోంలో పిల్లలకు కల్పిస్తున్న సౌకర్యాలు, మెనూ, పని చేసే సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకుని రికార్డులు పరిశీలించారు. ఆమె వెంట సీడీపీవో సుచిత్ర, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

ఇరుముడి మహోత్సవం

నగరం: స్థానిక శ్రీధర్మశాస్త్ర అయ్యప్పస్వామి దేవస్థానంలో మంగళవారం ఇరుముడి మహోత్సవ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. మాలధారణ స్వీకరించిన అయ్యప్పలు ఇరుముడి కార్యక్రమం నిర్వహించి శబరిమల పయనమయ్యారు. పద్యాల రామకోటేశ్వరావు గురుస్వామి శాస్త్రయుక్తంగా అయ్యప్పలకు ఇరుముడులను కట్టారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విశేష పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

వెల్లటూరు ఉపాధ్యాయుడికి డాక్టరేట్ ప్రదానం



భట్టిప్రోలు (కొల్లూరు) : సమాజ సేవ, మానవ హక్కులు, ప్రపంచ శాంతి కోసం పాటుపడే వ్యక్తులకు అందజేసే గౌరవ డాక్టరేట్ మండలంలోని వెల్లటూరు జెడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడికి వరించింది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని హైదరాబాద్‌లో వెల్లటూరు జిల్లా పరిషత్తు సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు గుర్రం మురళీమోహన్‌కు బిరుదును మనం ఫౌండేషన్ ప్రతినిధులు, కేంద్ర మాజీ మంత్రి సముద్రాల వేణుగోపాల్‌లు సోమవారం ప్రదానం చేశారు. తమ పాఠశాల ఉపాధ్యాయుడికి గౌరవ డాక్టరేట్ బిరుదు దక్కడం పట్ల ఉపాధ్యాయులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మనం ఫౌండేషన్ చైర్మన్ కె.చక్రవర్తి, దైవజ్ఞశర్మ సరస్వతి, శ్రీరామ్‌మూర్తి, త్రినాధరావు, శ్రీపాద సుబ్బరాజు, కె.అర్చన, డాక్టర్ శివలీల తదితరులు పాల్గొన్నారు.

పట్టణంలోన డ్రెయిన్‌లకు మరమ్మతులు

మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక



తెనాలిఅర్బన్: పట్టణంలోని డ్రెయిన్‌లకు మరమ్మతులు చేయిస్తున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక పేర్కొన్నారు. చెంచుపేట జరుగుతున్న ప్రధాన కాల్వ పూడికతీత పనులను మంగళవారం ఆమె పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెనాలి పట్టణంలోని అనేక కాల్వల పూడికతీత పనులు చేస్తున్నట్లు చెప్పారు. దీని వలన మురుగు నీరు పారుదల సక్రమంగా జరగడంతో పాటు దోమల వ్యాప్తి తగ్గుతుందన్నారు. ఆమె వెంట కౌన్సిలర్ యాతాటి అనిల్, టీపీవో సాంబశివరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

సమాధుల తోటను శుభ్రం చేయండి

మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న



తెనాలిఅర్బన్: ఈస్టర్ పండుగ సమీపిస్తున్న నేపథ్యంలో పట్టణంలోని సమాధుల తోటను శుభ్రం చేయాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న ఆదేశించారు. పాండురంగపేటలోని సమాధుల తోటను మంగళవారం ఆయన పరిశీలించారు. సమాధుల మధ్య ఉన్న పిచ్చి చెట్లను తొలగించాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈస్టర్ రోజు క్రైస్తవులు తమ పూర్వీకులను స్మరించుకుంటారని తెలిపారు. వారికి ఎటువంటి ఆటంకం కలుగకుండా తగు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఆయన వెంట డీఈ సుబ్బారావు, మున్సిపల్ ఉద్యోగులు ఉన్నారు.

అసంపూర్తిగా అంగన్‌వాడీ భవన నిర్మాణాలు

- అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారుతున్న వైనం
- అద్దె గృహాలలో అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ
- నిర్మాణం పూర్తయితే వసతులు మెరుగు



తొమ్మిదేళ్లగా అసంపూర్తిగా మిగిలిన కొల్లూరు సచివాలయం-3 పక్కన అంగన్‌వాడీ భవనం

కొల్లూరు : ప్రభుత్వ నిధులతో ఆరంభమైన భవన నిర్మాణాలు ఏళ్ల తరబడి అసంపూర్తిగా నిలిచిపోవడంతో అక్కరకు రాకుండా నిరుపయోగంగా మారిపోతున్నాయి. అంగన్‌వాడీ కేంద్రాలను సొంత భవనాలలో నిర్వహించడానికి నిర్మాణాలు చేపట్టినప్పటికీ వాటికి గ్రహణం పట్టడంతో అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణకు దూరం అవడంతోపాటు, అసాంఘిక కార్యకలాపాలకు ఆవాసాలుగా మారుతున్నాయి. అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ కోసం చేపట్టిన భవన నిర్మాణ పనులు ముందుకు కదలకుండా అర్ధాంతరంగా నిలిచిపోయాయి. ఫలితంగా అరకొర వసతులున్న అద్దె గృహాలలో ఐసీడీఎస్ సేవలు కొనసాగించాల్సిన దుస్థితి ఏర్పడింది.

గ్రహణం వీడేదెన్నడో

అంగన్‌వాడీ భవన నిర్మాణ పనులు ఏళ్ల తరబడి ముందుకు కదలకుండా నిలిచిపోవడంతో భవన నిర్మాణాలకు పట్టిన గ్రహణం వీడేదెన్నడో అన్న భావన ప్రజలలో వ్యక్తమవుతుంది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో మండలంలో కొల్లూరు మండల విద్యా వనరుల కేంద్రం వద్ద, చిలుమూరు, అనంతవరం, గాజుల్లంకల్లో నూతన అంగన్‌వాడీ భవనాల నిర్మాణాలకు ఉపాధి హామీ నిధులు రూ.7 లక్షలు మంజూరు అయ్యాయి. అయితే మిగిలిన మూడు గ్రామాలలోని అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణాలు పూర్తవ్వగా, కొల్లూరులో అంగన్‌వాడీ భవన నిర్మాణం అప్పట్లోనే నిలిచిపోయింది. అప్పటి అధికారుల అశ్రద్ధ కారణంగా తొమ్మిదేళ్ల క్రితం శ్లాబ్ దశలో నిలిచిపోయిన పనులు ఎక్కడివేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మిగిలిపోయాయి. ప్రభుత్వ యంత్రాంగం సైతం అసంపూర్తి భవన నిర్మాణం విషయం మర్చిపోవడంతో ప్రైవేటు వ్యక్తుల అవసరాలకు, అసాంఘిక కార్యకలాపాలకు ఆవాసంగా మారింది. మండలంలోని బొద్దులూరుపాడులో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నాడు-నేడు పథకం కింద రూ.12 లక్షల అంచనా వ్యయంతో చేపట్టిన అంగన్‌వాడీ నూతన భవన నిర్మాణం సైతం నిలిచిపోయింది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తొలి విడతలో కేటాయించిన రూ.5 లక్షల వరకు పనులు పూర్తవ్వగా, అనంతరం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం నిధులు మంజూరు చేయకపోవడంతో పనులు ముందుకు కదలకుండా ఆగిపోవడంతో సగం నిర్మాణం అయిన భవనం నిరుపయోగంగా మారింది. అసంపూర్తిగా ఉన్న అంగన్‌వాడీ భవనం మద్యపానం వంటి అసాంఘిక కార్యకలాపాలకు ఆవాసంగా మారింది.



బొద్దులూరుపాడు జగనన్న కాలనీలో అసంపూర్తిగా అంగన్‌వాడీ భవనం

నిర్మాణం పూర్తయితే వసతులు మెరుగు

అర్ధాంతరంగా నిలిచిపోయిన అంగన్‌వాడీ కేంద్రాల భవన నిర్మాణాలు ప్రభుత్వం పూర్తి చేసిన పక్షంలో వసతులు మెరుగవడంతోపాటు, అద్దె గృహాలలో కేంద్రాలు నిర్వహించాల్సిన ఆగత్యం తప్పుతుందన్న భావన ప్రజలలో వెల్లడవుతుంది. అద్దె గృహాలలో ఇరుకు గదులలో మగ్గుతున్న చిన్నారులు నూతన భవనాలు అందుబాటులోకి వస్తే పరిశుభ్రమైన, ప్రశాంత వాతావరణంలో సృజనాత్మక విద్యను నేర్చుకునే వెసులుబాటు కలుగుతుంది. అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతున్న అసంపూర్తి భవనాలపై ప్రభుత్వం దృష్టి సారించి నిర్మాణం పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.



బొద్దులూరుపాడు అంగన్‌వాడీ భవనం వద్ద మద్యం సీసాలు

అలుపెరగని పోరాటానికి సిద్ధం

పొలిటికల్ అడ్వైజరీ కమిటీ సభ్యులు కోన



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పిస్తున్న కోన రఘుపతి

బాపట్ల: రాష్ట్ర ప్రజలను చంద్రబాబు కూటమి ప్రభుత్వం నమ్మించి మరోసారి మోసం చేసిందని వైఎస్సార్‌సీపీ పొలిటికల్ అడ్వైజరీ కమిటీ సభ్యులు కోన రఘుపతి పేర్కొన్నారు. విదేశీ పర్యటన ముగించుకొని తిరిగి రావటంతోపాటు కమిటీ సభ్యునిగా ఎంపికైన తరువాత తొలిసారిగా బాపట్లకు వచ్చిన కోనకు రైల్వే స్టేషన్ వద్ద పార్టీ శ్రేణులు మంగళవారం బ్రహ్మరథం పట్టారు. రైల్వే స్టేషన్ నుంచి వైఎస్సార్‌సీపీ జెండాలతో భారీ జనసందోహంతో పురవీధుల్లో ప్రదర్శన చేపట్టారు. తొలుత రైల్వే స్టేషన్ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా కోన రఘుపతి మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా పాలన కొనసాగించిన వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకునేందుకు ప్రజలందరు ఎదురుచూస్తున్నారన్నారు. సచివాలయాలు, ఆర్బీకేలు, వలంటీర్ల వ్యవస్థతో పాలనను ప్రజల దగ్గరకు తీసుకువచ్చిన ఘనత జగన్ మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. నేడు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించలేని స్థితిలో కూటమి ప్రభుత్వం ఉందన్నారు.

✦ అభివృద్ధి, సంక్షేమం గాలికి వదిలేసిన చంద్రబాబు, తన కుమారుడు రెడ్‌బుక్ రాజకీయాలనే రాష్ట్రంలో అమలు చేస్తున్నారని కోన దుయ్యబట్టారు. జిల్లా అభివృద్ధి, మెడికల్ కళాశాల నిర్మాణ పనులు నిలిచిపోవటం బాధాకరమైన విషయమన్నారు. భావన్నారాయణస్వామి దేవాలయం అభివృద్ధి, రథం నిర్మాణానికి కృషి చేస్తే రథం తెచ్చేటప్పుడు కనీసం ఆహ్వానం లేకపోవటం బాధాకరమన్నారు.

✦ రాష్ట్రంలో మళ్లీ ఫ్యాన్ ప్రభంజనం వీస్తోందని కోన పేర్కొన్నారు. తమను చంద్రబాబు మళ్లీ మోసం చేశారని ప్రజలు ఏడాది పాలనలోనే గట్టిగా చెబుతున్నారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు దొంతిరెడ్డి సీతారామిరెడ్డి, కాగిత సుధీర్‌బాబు, మరుప్రోలు కొండలరెడ్డి, కోకి రాఘవరెడ్డి, ఎంపీపీ చిన్నపోతుల హరిబాబు, యారం వనజ, ఉయ్యూరు లీలా శ్రీనివాసరెడ్డి, హుస్సేన్, పిన్నిబోయిన ప్రసాద్, కొక్కిలిగడ్డ చెంచయ్య, నక్రావుల వెంకట్రావు, బుల్లిరెడ్డి, గంగిశెట్టి రత్తయ్య, మోర్ల సముద్రాల గౌడ్, జోగి రాజా, షేక్ సయ్యద్ పీర్, ఇనగలూరి మాల్యాద్రి, వేల్పుల మీరాభి, గొర్రుముచ్చు పుష్పరాజ్యం, లక్ష్మీరాఘవ, చింతల రాజశేఖర్, వడ్డిముక్కల డేవిడ్, ఆట్ల ప్రసాదరెడ్డి, చల్లా రామయ్య తదితరులు ఉన్నారు.



కోన రఘుపతికి ఆహ్వానం పలుకుతున్న పార్టీ శ్రేణులు

అంగన్‌వాడీ కేంద్రాలలో చిన్నారులకు పౌష్టిక ఆహారం

సీడీపీవో సుచిత్ర



అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన కల్పిస్తున్న సీడీపీవో సుచిత్ర

రేపల్లె రూరల్: అంగన్‌వాడీ కేంద్రాలలో చిన్నారులకు పౌష్టిక విలువలతో కూడిన ఆహారం అందించబడుతుందని సీడీపీవో ఎం.సుచిత్ర తెలిపారు. పౌష్టికాహార పక్షోత్సవాలలో భాగంగా మంగళవారం గురువు రోడ్ అంగన్‌వాడీ సెంటరులో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహార ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూరగాయలు, పాలు, ఆకుకూరలను నిత్యం ఆహారంలో భాగం చేసుకోవాలన్నారు. పౌష్టికాహార లోపంతో అనేక రుగ్మతలను ఎదుర్కొనాల్సిన పరిస్థితులు ఉంటాయన్నారు. తప్పనిసరిగా సంపూర్ణ ఆహారం తీసుకోవటంతో పాటు ఎటువంటి అనారోగ్య సమస్యలు తలెత్తినా వెంటనే వైద్యుడిని సంప్రదించి చికిత్సలు పొందాలన్నారు. అప్పుడే పుట్టిన చిన్నారికి తల్లి మర్రుపాలు పట్టించాలన్నారు. అప్పుడే చిన్నారిలో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని చెప్పారు. సకాలంలో చిన్నారులకు అవసరమైన టీకాలు అందించాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ శివ జ్యోతి, అంగన్‌వాడీ కార్యకర్త అనిత తదితరులు పాల్గొన్నారు.

మేలు రకం వంగడాలు సాగు చేయాలి

జిల్లా వ్యవసాయాధికారి రామకృష్ణ



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి రామకృష్ణ

యాజలి(కర్లపాలెం): మేలు రకం వంగడాలను సాగు చేయటంతో అధిక దిగుబడులు వస్తాయని జిల్లా వ్యవసాయాధికారి వై.రామకృష్ణ తెలిపారు. యాజలి రైతు ఉత్పత్తిదారుల సంస్థ కార్యాలయంలో మంగళవారం వేరుశనగ సాగుపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సులో రామకృష్ణ మాట్లాడుతూ వేరుశనగ సాగు చేస్తున్న రైతులందరూ తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించాలని చెప్పారు. భూసార పరీక్షలు చేయించటం వలన ఎలాంటి ఎరువులు వెయ్యాలో తెలుస్తుందన్నారు. వ్యవసాయాధికారులు సూచించిన మోతాదు మేరకే ఎరువులు వాడాలని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం శాస్త్రవేత్తల సిఫారసు మేరకు హెక్టార్‌కు 150 కిలోల వేరుశనగ విత్తనం రైతులకు ఉచితంగా అందిస్తుందని తెలిపారు. యాజలి రైతు ఉత్పత్తిదారుల సంస్థ చైర్మన్ ఇక్కుర్తి లక్ష్మీనరసింహ మాట్లాడుతూ తమ సంస్థ ద్వారా సాగు చేసిన వేరుశనగను కనీస మద్దతు ధరకు కొనుగోలు చేస్తామని తెలిపారు. శాస్త్రవేత్త మురళీనాయక్ మాట్లాడుతూ ట్యాగ్-73, టీసీజీఎస్-1694 రకాలను సాగు చేయటం వలన దిగుబడి మంచిగా వస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ లక్ష్మి, ఏవో సుమంత్‌కుమార్, ఏఈవో భాగ్యలక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

జాబ్ కార్డులున్న కుటుంబాలకు పనులు కల్పించాలి

ఎంపీడీవో ఎ.శ్రీనివాసరావు

నల్లమోతువారిపాలెం(కర్లపాలెం): మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో జాబ్ కార్డులున్న కుటుంబాల వారికి ఉపాధి పనులు కల్పించాలని ఎంపీడీవో ఎ.శ్రీనివాసరావు చెప్పారు. మంగళవారం నల్లమోతువారిపాలెంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఎంపీడీవో పరిశీలించారు. అనంతరం ఉపాధి హామీ పథకంలో భాగంగా పశువులకు నీటి కోసం నిర్మిస్తున్న తొట్టెను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ఉపాధి హామీ పనులు ఉదయాన్నే పూర్తి చేయాలని చెప్పారు. నీటి తొట్టె నిర్మాణం సకాలంలో పూర్తి చేసి పశువులు తాగేందుకు నీటి వసతి కల్పించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు తాండ్ర సాంబశివరావు, గ్రామస్తులు మాడా శ్రీనివాసరావు, మునిపల్లి చిన్న, గరిగంటి శ్రీను, ఏపీవో శ్యామ్, ఫీల్డ్ అసిస్టెంట్లు శాలినీ, నాగాంజనేయులు తదితరులు ఉన్నారు.

'ఆయుష్మాన్' ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



ఏపీఐఐసీ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమంలో ఆయుష్మాన్ ఆరోగ్యమందిర్ హెల్త్ ఆఫీసర్లు

మంగళగిరి టౌన్: గ్రామీణ ప్రాంతాల్లోని ఆయుష్మాన్ ఆరోగ్యమందిర్ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లుగా పనిచేస్తున్న వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్ / కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.నిరంజన్, కార్యదర్శి సందీప్, కో-ఆర్డినేటర్ వినోద్‌కుమార్ కోరారు. మంగళగిరి నగర పరిధిలోని ఆటోనగర్‌లో వున్న ఏపీఐఐసీ కార్యాలయం వద్ద ఏపీఎంసీఏ ఆధ్వర్యంలో మంగళవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. హెల్త్ వెల్‌నెస్ సెంటర్ సెల్ నోడల్ ఆఫీసర్ శ్యామల, ప్రోగ్రామ్ ఆఫీసర్ సుబ్రహ్మణ్యంకు వారి సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఆరు సంవత్సరాలుగా ఆయుష్మాన్ ఆరోగ్యమందిర్‌లో పనిచేస్తున్న మాకు ఉన్న సమస్యలు చెప్పుకోవడానికి మెడికల్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ అధికారులను కలిశామని అన్నారు. ఆయుష్మాన్ భారత్ నిబంధనల ప్రకారం ఉద్యోగ భద్రత కల్పించాలని, ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులతో సమానంగా 23 శాతం ఉద్యోగ సవరణ జరగాలని కోరారు. కమ్యూనిటీ ఆఫీసర్లుగా ఆరు సంవత్సరాల తరువాత రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. 2019 నుంచి గ్రామీణ ప్రాంతాల్లోని ఆయుష్మాన్ ఆరోగ్యమందిర కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లుగా పనిచేస్తున్న తాము గత రెండు సంవత్సరాలుగా జీతాల విషయంలో తీవ్ర నిరాశ ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు మమత, రాజీవ్, నంద్యాల జిల్లా అధ్యక్షుడు శివకృష్ణ, సత్యసాయి జిల్లా అధ్యక్షుడు కార్తీక్‌రెడ్డి, అనంతపురం జిల్లా అధ్యక్షుడు గణేష్‌కుమార్, ఇతర జిల్లాల అధ్యక్షులు పాలొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన ఉండాలి

అగ్నిమాపక శాఖ అధికారి సాంబశివరావు



అగ్నిప్రమాదాలు నివారణ జాగ్రత్తలపై కరపత్రాలను అందజేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

రేపల్లె రూరల్: ప్రజలు అగ్నిప్రమాదాలపై అవగాహన కలిగి ఉండాలని అగ్నిమాపక శాఖ అధికారి వై.సాంబశివరావు అన్నారు. అగ్నిమాపక వారోత్సవాలను పురస్కరించుకుని రేపల్లె అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని రైల్వేస్టేషన్, బస్టాండ్ సెంటర్‌లలో ప్రయాణికులకు అగ్నిప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రెండవరోజు కరపత్రాలను పంపిణీ చేశారు. రాజ్యలక్ష్మి థియేటర్ సెంటరులో అగ్నిమాపక శకటంతో ప్రత్యేక ప్రదర్శనలు చేశారు. ఈ సందర్భంగా సాంబశివరావు మాట్లాడుతూ మహిళలు ఇళ్లలో వంట ముగిసిన తరువాత, రాత్రి సమయంలో తప్పనిసరిగా గ్యాస్ రెగ్యులేటర్‌ను ఆపివేయాలన్నారు. విద్యుత్ వైర్ల నిర్వహణ సక్రమంగా ఉండేలా సరిచూసుకోవాలన్నారు. సమీపంలో అగ్నిప్రమాదం చోటు చేసుకుంటే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించి ప్రమాదాలను నివారించవచ్చన్నారు. నివాసాలలో విద్యుత్ వైరింగ్‌లో లూజ్ కాంటాక్ట్‌లు ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పంట చేలల్లో చెత్తను తగలబెట్టే సమయంలో నీటిని అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఈ సందర్భంగా అగ్ని ప్రమాద సమయాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో అగ్నిమాపక శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణ అందరి బాధ్యత

బాపట్ల అగ్నిమాపకాధికారి వై.వెంకటేశ్వరరావు



రైల్వేస్టేషన్ వద్ద ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఫైర్ ఆఫీసర్ వెంకటేశ్వరరావు

బాపట్లటౌన్: అగ్ని ప్రమాదాలను నివారించాల్సిన బాధ్యత అందరిపై ఉందని అగ్నిమాపకాధికారి యార్లగడ్డ వెంకటేశ్వరరావు తెలిపారు. అగ్ని ప్రమాద వారోత్సవాల్లో భాగంగా మంగళవారం పట్టణంలోని రైల్వేస్టేషన్, బస్‌స్టేషన్, ప్రధాన కూడలి ప్రాంతాల్లోని ప్రజలకు అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించారు. అగ్నిమాపకాధికారి వై.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ 1944 ఏప్రిల్ 14న ముంబై ఓడరేవులో ఒక నౌకలో జరిగిన అగ్ని ప్రమాదం వలన 66 మంది అగ్నిమాపక సిబ్బంది, 336 మంది ప్రజలు అక్కడికక్కడే మృతి చెందారని, వారి మృతికి చిహ్నంగా ప్రతి ఏడాది ఏప్రిల్ 14 నుంచి 20వ తేదీ వరకు అగ్నిమాపక వారోత్సవాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. అగ్ని ప్రమాదం వలన ఎంతో విలువైన నగదు, ఆస్తి, ప్రాణ నష్టాలు సంభవించే ప్రమాదం ఉంటుందన్నారు. వాటిని నివారించేందుకు అగ్నిమాపక సిబ్బందితోపాటు సమాజంలోని ప్రతి ఒక్కరు చైతన్యవంతులు కావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మహిళలు వంట సమయంలో ఎంతో అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది, రైల్వే అధికారులు, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

క్లాప్ ఆటోడ్రైవర్లకు వేతనాలు ఇవ్వాలి



కమిషనర్ అలీమ్‌బాషాకు వినతిపత్రం అందజేస్తున్న కార్మిక సంఘం నాయకులు

మంగళగిరి టౌన్: మంగళగిరి-తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలో పనిచేస్తున్న క్లాప్ ఆటో డ్రైవర్లకు రెండు నెలలుగా వేతనాలు చెల్లించకపోవడం దారుణమని, వెంటనే వేతనాలు చెల్లించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు. మంగళగిరి నగర పరిధిలోని ఎంటీఎంసీ కార్యాలయం ఎదుట గత 9 రోజులుగా చేస్తున్న సమ్మె మంగళవారం 10వ రోజు కొనసాగింది. ఈ సందర్భంగా కార్యాలయం గేటు ఎదుట ధర్నా నిర్వహించారు. ఉమా మహేశ్వరరావు మాట్లాడుతూ ఇన్ని రోజులుగా క్లాప్ ఆటో డ్రైవర్లు సమ్మె చేస్తున్నా స్థానిక ఎమ్మెల్యే నారా లోకేష్ స్పందించకపోవడం దారుణమని, ఇప్పటికైనా ఆయన స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు. జీతాలు చెల్లించని పక్షంలో కోర్టుకు వెళ్లాల్సి వస్తుందని హెచ్చరించారు. కనీస వేతనం నెలకు రూ. 24500లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎంటీఎంసీ కమిషనర్ అలీమ్‌బాషాకు కార్మిక సంఘం నాయకులు వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ జిల్లా నాయకులు చెంగయ్య, వీవీ జవహర్‌లాల్, పట్టణ నాయకులు బాలాజీ, క్లాప్ ఆటో డ్రైవర్స్ యూనియన్ నాయకులు ఎం.రవి, కృష్ణ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కుటుంబానికి అండగా నిలబడదాం

తెనాలిటౌన్: వీడియో గ్రాఫర్స్ అండ్ ఫోటోగ్రాఫర్స్ వేల్ఫేర్ అసోసియేషన్ సభ్యుడు వెంకీ ఇటీవల మృతి చెందడం బాధకరవిషయమని అసోసియేషన్ అధ్యక్షుడు సాంబశివరావు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక దేవి చౌక్‌లోని ఆంధ్రాప్యారిస్ కిడ్స్ స్టూడియో నందు అసోసియేషన్ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఇటీవల మృతి చెందిన సీనియర్ వీడియోగ్రాఫర్ వెంకీ మృతికి సంతాపం తెలిపారు. ఆయన కుటుంబానికి అండగా ఉంటామని చెప్పారు. నూతన సభ్యత్వాల నమోదు, ఐడీ కార్డులు వంటి విషయాలపై చర్చించారు. అనారోగ్యంతో బాధపడుతున్న సీనియర్ ఫోటోగ్రాఫర్ రాముకి ఆర్థికసాయం అందించాలని నిర్ణయించారు. సమావేశంలో అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

అనాథలకు కాస్మోటిక్ వస్తువులు పంపిణీ

తెనాలిటౌన్: పరిశుభ్రతకు ప్రాధాన్యతనిచ్చి ఆరోగ్యవంతమైన జీవితం గడపాలని తెనాలి వెల్ఫేర్ డెవలప్‌మెంట్ సొసైటీ సభ్యులు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక స్వధార్ హోం లోని మానసికులు, అనాథలకు అవసరమైన కాస్మోటిక్, నిత్యావసర వస్తువుల పంపిణీ నిర్వహించారు. కొల్లి హర్షవర్ధన్‌రెడ్డి జ్ఞాపకార్థం ఆయన భార్య సునీత ఈ సేవా కార్యక్రమం చేపట్టారు. దాదాపు 55 మందికి సభ్యులు టూత్ పేస్ట్‌లు, ఆహారానికి సంబంధించిన వస్తువులు అందజేశారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హృదయమేరి, సునీత, డెవలప్‌మెంట్ సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

500 గ్రాముల గంజాయి పట్టివేత

మంగళగిరి రూరల్ పోలీసుల అదుపులో ముగ్గురు నిందితులు

మంగళగిరి టౌన్: మంగళగిరి రూరల్ పరిధిలో గంజాయి కలిగి వున్న ముగ్గురు వ్యక్తులను రూరల్ పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. మంగళగిరి కాజ టోల్‌గేటు వైపుగా కారులో ముగ్గురు వ్యక్తులు గంజాయితో వస్తున్నట్లు ఈగల్ టీమ్‌కు సమాచారం అందడంతో మంగళవారం టోల్‌గేటు వద్ద ఈగల్‌టీమ్ పోలీసులు పహారా కాశారు. మధ్యాహ్న సమయంలో కారులో వస్తున్న ముగ్గురు వ్యక్తులను ఈగల్‌టీమ్ అదుపులోకి తీసుకున్నారు. కారును తనిఖీ చేయగా సుమారు 500 గ్రాములు గంజాయి ఉందని, ఆ గంజాయి కొత్తరకం హైడ్రో గంజాయి మాదకద్రవ్యంగా ఈగల్‌టీమ్ పోలీసులు అనుమానం వ్యక్తం చేసినట్లు సమాచారం. అదుపులోకి తీసుకున్న వ్యక్తులను కొత్తరకం గంజాయని, మంగళగిరి రూరల్ సర్కిల్ కార్యాలయానికి తరలించినట్లు విశ్వసనీయ సమాచారం. బెంగళూరు నుంచి విశాఖపట్నంకు తీసుకువెళుతున్నట్లు ఈగల్‌టీమ్ ప్రాథమిక విచారణలో తేలిందని, రూరల్ పోలీసులు ముగ్గురు వ్యక్తులను విచారిస్తున్నట్లు తెలియవచ్చింది.